క్లుప్తంగా

క్రమం తప్పకుండా మందులు వాడాలి



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ గోపాలం శివ నారాయణ

కదిరి: క్రమం తప్పకుండా మందులు వాడితే మూర్ఛ నయమవుతుందని విజయవాడకు చెందిన ప్రముఖ నరాల వైద్య నిపుణులు డా.గోపాలం శివనారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక స్థానిక ఎస్‌జీటీ హోమ్‌లో జన విజ్ఞాన వేదిక కదిరి శాఖ ఆధ్వర్యంలో మూర్ఛ రోగుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం డాక్టర్ గోపాలం శివనారాయణ మూర్ఛ రోగులకు వైద్యం అందించడంతో పాటు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కొందరు యువకులు మూర్ఛ ఉన్నట్లు చెబితే పెళ్లి కాదనే అపోహతో దాస్తున్నారని, ఇది సరైనా పద్ధతి కాదన్నారు. మూర్ఛ ఉన్న వారు ఒంటరిగా ప్రయాణించడం చేయరాదన్నారు. మూర్ఛ ఉన్న మహిళలు వంట గదిలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కదిరి, పరిసర మండలాలకు చెందిన 70 మంది మూర్ఛరోగులకు ఉచితంగా వైద్యం అందించారు. వచ్చేఏడాది జనవరి 18న వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు జన విజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు బాలే నరసారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ విద్యా కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ మహేందర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్లు నాగబసిరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: అమడగూరు మండలం గాజులపల్లి వృద్ధాశ్రమంలో కంటి సమస్యతో బాధపడుతున్న వెంకటరమణ అనే వృద్ధుడికి మానస ధార సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఎంఎస్ ప్రశాంత్ రూ.10 వేలు ఆర్థిక సాయం ఆదివారం చేశాడు. వృద్ధాశ్రమానికి సరుకులు అందించారు. తన తల్లిదండ్రులు పద్మాశ్రీనివాస్, సరితాప్రశాంత్ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం చేసినట్లు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గంగాధర్, సుబ్బన్న, నాగేంద్రప్రసాద్‌ను ఆదివారం సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌కు సుదీర్ఘంగా సేవలు అందించిన కృష్ణమూర్తి, నరసింహులును సన్మానించారు. కార్యక్రమానికి కదిరి జోన్‌లోని అన్ని మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు సహకరించాలి



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కలసిన హెచ్‌ఎం

పుట్టపర్తి: త్వరలో నిర్వహించే కొత్తచెరువు ఉన్నత పాఠశాల డైమండ్ ఉత్సవాల నిర్వహణకు సహకారం అందించాలని హెచ్‌ఎం గోపాల్, విశ్రాంత్ హెచ్‌ఎం వెంగన్న తదితరులు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే, కలెక్టర్‌ను కలిసి సహకారం అందించాలని కోరామన్నారు. అలాగే తాను రాసిన కొత్తచెరువు, బుక్కపట్నం గ్రామాల చరిత్ర పుస్తకాన్ని వారికి అందించినట్లు వెంగన్న తెలిపారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌ను సన్మానించారు.

రామనామ జపం



శ్రీరామ నామ మంత్రాన్ని జపిస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో రామదండు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలో 108 సార్లు రామనామాన్ని జపించారు. శ్రీరాముని చిత్రపటానికి పూలతో అభిషేకం, అర్చనలు, పూజలు నిర్వహించారు. ప్రతి వారం రామ మంత్రం జపిస్తున్నామని భక్తులు అన్న లక్ష్మీనారాయణ, సుకుమార్, వినేష్, కేతా లోకేష్, శంకర్ యుగంధర్, కిషోర్, వేణుగోపాల్ తదితరులు తెలిపారు.

అద్దె గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు



గాండ్లపెంటలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



ఎలుగూటివారిపల్లిలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



కటారుపల్లి గొల్లపల్లిలో మొండి గోడలకే పరిమితమైన అంగన్‌వాడీ కేంద్రం

- గాలి వెలుతురు లేని గదుల్లో కేంద్రాల నిర్వహణ
- సౌకర్యాలు లేక చిన్నారులు, గర్భిణుల అవస్థ

గాండ్లపెంట: నియోజకవర్గంలోని నల్లచెరువు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు అసౌకర్యాలు, అద్దె గదుల్లో నడుస్తున్నాయి. కనీసం గాలి,వెలుతురు లేని గదుల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. దీంతో కేంద్రాలకు వచ్చే గర్భిణులు, చిన్నారులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు ప్రాజెక్టు పరిధిలో ఉన్న గాండ్లపెంట, నల్లచెరువు, తనకల్లు మండలాల్లో మెయిన్ (ప్రధాన), మినీ కేంద్రాలు 216 ఉన్నాయి. అందులో 87 కేంద్రాలు అద్దె గదుల్లో నిర్వహిస్తుండగా, దాతలు ఇచ్చిన గదుల్లో 63 కేంద్రాలు, ప్రభుత్వ భవనాల్లో 154 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో కేంద్రాలు నిర్వహించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగే కేంద్రాలను అద్దె గదుల్లోకి మార్చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు– నేడు కార్యక్రమంలో భాగంగా మంజూరైన భవనాలు ఎన్నికల సమయంలో నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం వాటిని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోలేదు. కటారుపల్లిలో పదేళ్ల క్రితం మంజూరైన భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. అప్పట్లో మంజూరైన నిధులు భవన నిర్మాణానికి సరిపోకపోగా, మొండి గోడలకే పరిమితమైంది. అసంపూర్తిగా ఉన్న భవనాలకు సరిపడా నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త కేంద్రాలను మంజూరు చేయాలి

పలు గ్రామాల్లో అద్దె గదుల్లో ఉన్న కేంద్రాలకు ప్రభుత్వం తరఫున భూమి కేటాయించి నూతన భవనాలను మంజూరు చేయాలి. గాలి, వెలుతురు లేని కేంద్రాల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాల్లో ఉన్న కేంద్రాలకు తమ చిన్నారులను పంపడానికి తల్లిదండ్రులు సుముఖంగా లేరు. ప్రభుత్వం స్పందించి కొత్త కేంద్రాలను మంజూరు చేయాలి.

– శ్రీరాములు నాయుడు, సీపీఐ మండల కార్యదర్శి



దాతలు ముందుకు రావాలి..

గ్రామాల్లో దాతలు ముందుకు వచ్చి అంగన్‌వాడీ భవనాలకు స్థలం ఇస్తే ప్రభుత్వానికి నూతన కేంద్రాల నిర్మాణాలు చేపట్టే విధంగా నివేదికలు పంపుతాం. ప్రస్తుతం గ్రామాల్లో గాలి,వెలుతురు ఉండేలా రెండు గదులున్న భవనాలను అద్దెకు తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించాం. గ్రామాల్లో కేంద్రాల నిర్వహణకు సరైన గదులు అందుబాటులోలేవు. కేంద్రాలు మూతపడకూడదని గ్రామాల్లో అందుబాటులో ఉన్న అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నాం.

– వెంకటలక్ష్మమ్మ, సీడీపీఓ, నల్లచెరువు ప్రాజెక్టు

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

ముదిగుబ్బ: మహిళలనే వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శివరాముడు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లు, ఇదివరకు మహిళలను వేధించిన కేసుల్లో ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా స్కూలుకు వెళ్లే విద్యార్థినులు, మహిళల వెంటపడితే అలాంటి వారిని చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బత్తలపల్లి: మహిళలు, చిన్నారుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తి రౌడీ షీటర్లను హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గతంలో మండలంలో మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ధర్మవరం అర్బన్: మహిళలు, అమ్మాయిల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని టూ టౌన్ సీఐ రెడ్డెప్ప హెచ్చరించారు. పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పోక్సో, మహిళలను వేధించడం, మానసికంగా శారీరకంగా వెంటపడి వేధించడం తదితర కేసుల్లోని ముద్దాయిలకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా స్కూళ్లు, కాలేజీకి వెళ్లే అమ్మాయిలను వెంటపడి వేధించడం, వారికి ఇబ్బంది కలిగించడం లాంటి చట్ట వ్యతిరేక పనులు, ఆకతాయి చేష్టలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మహిళలపైన నేరాలకు పాల్పడితే వారిపైన సెక్సువల్ అఫెండర్స్ షీట్స్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

గాండ్లపెంట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కదిరి రూరల్ సీఐ నాగేంద్ర ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలకు, వివాదాలకు పాల్పడకూడదని ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. స్థానిక పీఎస్‌ఐ రవికుమార్, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర, బాషా పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సత్యనారాయణ హెచ్చరించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పోక్సో కేసు, లైంగిక నేరాలకు పాల్పడిన వారిని ఆదివారం చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి నేరాలకు పాల్పడినా, వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే నేరారోపణలు ఉన్న వారు గ్రామాల్లో క్రమశిక్షణతో, ప్రశాంతంగా ఉండాలన్నారు. గ్రామాల్లో మహిళలు, బాలికల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు.



ముదిగుబ్బలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శివరాముడు

నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్టు


కదిరి అర్బన్: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలపై లైంగిక నేరాలకు పాల్పడిన వారికి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శివనారాయణస్వామి,సీఐ నిరంజన్‌రెడ్డితో కలిసి ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు.

తనకల్లు: మహిళలు, చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గోపీ హెచ్చరించారు.ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మహిళలకు భద్రత, చిన్నారులకు రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. క్షణికావేశంలో చేసిన తప్పులు జీవితాంతం వెంటాడుతాయనే విషయం గుర్తుకు పెట్టుకోవాలన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రుల ఉత్సవాలు



కొత్తచెరువులోని పెద్దమ్మ తల్లి విగ్రహం



అమడగూరులోని చౌడేశ్వరి అమ్మవారు



పుట్టపర్తిలో పూజలందుకున్న గ్రామ దేవత సత్తెమ్మ

కొత్తచెరువు: మండల కేంద్రంలో పెద్దమ్మస్వామి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల సందదర్భంగా అమ్మవారికి ఉదయం సాయంత్రం కుంకుమార్చనా అభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వచ్చే నెల 2న విజయదశమి రోజున అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఓడీచెరువు (అమడగూరు): మండల కేంద్రంలోని చౌడేశ్వరీ ఆలయంలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పొట్ట పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు తాగునీరు, వైద్య సదుపాయాలతో పాటు రోజూ తీర్థ ప్రసాదాలు, అన్నదాన సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. చౌడేశ్వరీ అమ్మవారు సోమవారం బాలా త్రిపుర సుందరిదేవిగా దర్శనం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

ముస్తాబైన అమ్మవారి ఆలయాలు

పుట్టపర్తి టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి అక్టోబర్ 2 వతేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి ఆలయాలను దీపకాంతులతో అలంకరించారు. జిల్లా కేంద్రంలో పుట్టపర్తి సత్తెమ్మ ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, చిత్రావతి నది ఒడ్డున. ఎనుములపల్లి వద్ద ఉన్న దుర్గామాత ఆలయాలు ఇప్పటికే ముస్తాబయ్యాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు విభిన్న రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. రోజూ సాయంత్రం సాంస్కృతిక సంబరాలు ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.



పుట్టపర్తిలో నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన సత్తెమ్మ ఆలయం

బత్తలపల్లి: మండల కేంద్రంలో ఫ్రెండ్స్ లెవన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి దసరా పండుగను పురస్కరించుకుని దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా అమ్మవారు సోమవారం బాలాత్రిపుర సుందరీ దేవి, మంగళవారం గాయత్రీదేవి, బుధవారం లలితా త్రిపుర సుందరి, గురువారం మహేశ్వరిదేవి, శుక్రవారం మహాలక్ష్మీదేవి, శనివారం అన్నపూర్ణేశ్వరీ దేవీ అలంకరణ, ఆదివారం ద్రాక్షాయణి దేవి, సోమవారం సరస్వతిదేవి, మంగళవారం దుర్గాదేవి(దుర్గాష్టమి), అక్టోబర్ 1వ తేదీ బుధవారం మహిషాసుర మర్దిని అలంకరణ, దసరా పండుగ రోజున రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

‘రణభేరి’ బహిరంగ సభ జయప్రదం చేయండి

ధర్మవరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై తలపెట్టిన యూటీఎఫ్ రణభేరి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి కోరారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం రణభేరి బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పీఆర్‌సీ వర్తింపు చేయాలని, పీఆర్‌సీ కమిటీ చైర్మన్ నియామకం ఆలస్యమైతే 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఈనెల 25వతేదిన గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే భారీ బహిరంగ సభకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, సురేష్, హెచ్.రామంజినేయులు, పుల్లయ్య, శంకర్, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏఐఎఫ్‌డీఎస్ మండల కమిటీ ఎంపిక



ఎంపికైన మండల కమిటీ సభ్యులు

ధర్మవరం రూరల్: ఏఐఎఫ్‌డీఎస్ ధర్మవరం మండల నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. తుంపర్తి గ్రామంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్‌రెడ్డి, కార్యదర్శి దేవేంద్ర అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. మండలాధ్యక్షుడిగా పి. సాయి, ఉపాధ్యక్షుడిగా సాయి, సహాయ కార్యదర్శి రాకేష్, సుహెల్, సుధానంద్, మారుతిని ఎంపిక చేశారు.

ఆకాశంలో అందాల హరివిల్లు



బత్తలపల్లిలో కనువిందు చేస్తున్న ఇంద్రధనుస్సు

బత్తలపల్లి: ఆకాశంలో అందాల హరివిల్లు ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో 20 నిమిషాలు పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ సమయంలో వర్షం ఆగిపోయిన తరువాత ఏర్పడిన ఇంద్ర ధనుస్సు పలువురు ఆసక్తిగా తిలకించారు.

ప్రమాదకరంగా ప్రయాణం





జగరాజుపల్లి వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు, కప్పలబండ వద్ద సిగ్నల్ బోర్డు కనిపించని దృశ్యం

పుట్టపర్తి అర్బన్: ప్రధాన రోడ్ల పక్కనే చిట్టడవులను తలపించే విధంగా పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు పెరిగి పోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా రెండు మూడు సార్లు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను, పిచ్చి మొక్క తొలగించి ప్రయాణాలను సురక్షితం చేయాల్సిన అధికారులు ఏడాదిన్నర నుంచి పట్టించుకోక పోవడం విశేషం. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోడ్లపై గుంతలను పూడ్చక పోగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించక పోవడంతో ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. సమస్యను సంబంధిత ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులకు ప్రజలు విన్నవిస్తున్నా పట్టించుకునే తీరిక లేక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు ఎదురుగా వచ్చే సమయంలో రోడ్డు దిగడానికి కూడా వీలులేకుండా ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెంచుకుపోయాయి. చెట్లలో నుంచి కుక్కలు , పాములు, ఇతర జంతువులు షడన్‌గా వస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొంత మంది చేతులు, కాళ్లు పోగొట్టుకోగా, మరి కొంత మంది ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. అయినా అధికారులు ఇవేవీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు, ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు తొలగించి అందులో ఇరుక్కుపోయిన సిగ్నల్ బోర్డులు కనిపించేలా చేయాలని వాహనదారులు సూచిస్తున్నారు. ఈ చెట్ల మధ్యలోనే విద్యుత్ స్తంభాలు , విద్యుత్ లైన్లు ఉండడం విశేషం. చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లకు తగిలేలా పెంచుకున్నాయి. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని తెలియజేశారు.

తనకల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధికారులు హాజరుకావాలన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్: గుట్టూరు వైజంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కియా ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాలు..మక్కాజిపల్లి తండాకు చెందిన రామాంజి నాయక్ తన కుమారుడు సుశాంత్‌తో కలసి వ్యక్తి గత పనుల నిమిత్తం గుట్టూరుకు బైక్‌పై బయలుదేరారు. వైజంక్షన్ వద్దకు రాగానే అనంతపురం వెళ్తున్న కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన తండ్రీకుమారులను స్థానికులు 108 వాహనం ద్వారా పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బస్టాండ్ ఆవరణలో చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం

ఎన్పీకుంట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొసెట్టి రామ్మోహన్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో పారిశుధ్య కార్మికులతో కలిసి పరిసరాలలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, టీ కప్పులు, ప్లాస్టిక్ బాటిళ్లను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీరాములు, రమణ, సలీం, గురివిరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పితృపక్ష మహాలయ అమావాస్య

బత్తలపల్లి: మండలవ్యాప్తంగా ఆదివారం పత్ృపక్ష మహాలయ అమావాస్యను(పెద్దల పండుగ) ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల్లో మృతి చెందిన తల్లిదండ్రులు, వారి వారి కుటుంబీకులకు సమాధుల వద్ద పూజలు నిర్వహించారు. మృతి చెందిన వారికి ఇష్టమైన ఆహార పదార్థాలను అక్కడ ఉంచారు. హిందూ పంచాంగం ప్రకారం ప్రతి సంవత్సరం భాద్రపద మాసంలో చివరి రోజున మహాలయ అమావాస్య వస్తుంది. హిందూ మత విశ్వాసాల ప్రకారం ఈ సమయంలో పూర్వీకులు భూలోకానికి వస్తారని వారి నమ్మకం. సమాధుల వద్ద పూజల అనంతరం వారి వారి ఇళ్లల్లో మృతి చెందిన వారి పేరిట నూతన వస్త్రాలు ఉంచి పూజలు నిర్వహించారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని కందికుంట నారాయణమ్మ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులు కాలనీలో పర్యటించి, స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, నీటి సమస్యలు ఉన్నాయని సీపీఎం కార్యదర్శి సాంబశివ,నాయకులు తెలిపారు. కాలనీలో వర్షం పడితే ఈ రోడ్డులో నడవలేని పరిస్థితి ఉందన్నారు. మురుగు కాలువలు లేక మురికినీరు రోడ్డు మీదకి రావడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్, దివాకర్‌నాయక్, మోహన్, శ్రీనివాసులు, జమీర్,బాబ్జాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల మధ్య భూ వివాదం



తొలగించిన కంచెను చూపుతున్న శ్రీనివాసులు కుటుంబసభ్యులు

పుట్టపర్తి టౌన్: టీడీపీ నాయకుల మధ్య భూ వివాదం నెలకొంది. సొంత పార్టీ వారే తన భూమి ఆక్రమించి అన్యాయం చేస్తున్నారని కొత్త చెరువుకు చెందిన టీడీపీ నేత గూడా శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాలు.. పుట్టపర్తి మండలం కప్పలబండ పొలంలో సర్వే నంబర్ 266–1 లో 5.25 ఎకరాల భూమి ఉంది. ఆ పొలం ఆయన తండ్రి గూడా వెంకటేష్ ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్నప్పుడు 1982లో అప్పటి ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. ఆయన మరణానంతరం కుమారుడు శ్రీనివాసులుకు వారసత్వంగా వచ్చింది. అప్పటి నుంచి ఆయనే సాగు చేసుకుంటున్నాడు. అయితే రెండేళ్ల క్రితం కొత్తచెరువుకు చెందిన టీడీపీ నేత అనంత కిష్టప్ప అనే వ్యక్తి ఆ భూమిని తనపేరిట ఎక్కించుకున్నాడు. అప్పటి నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుతున్నా న్యాయం జరగలేదని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం కిష్టప్ప దౌర్జన్యంగా తన భూమి కంచెను తొలగించి పంటలు నాశనం చేస్తున్నాడన్నాడు. న్యాయం చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు ఫిర్యాదు చేశానన్నాడు. ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే సింధూరారెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.